తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గద్దం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి ఆస్త్రం...

హైదరాబాద్
శనివారం
29 జూన్ 2024
సంపుటి : 02
సంచిక : 26
పేజీలు : 8
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



# రేషన్ కార్డు ఆధారంగా మాఫీ ఉండదు





- ఇచ్చిన హామీమేరకు 2లక్షల రుణమాఫీ
- నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల
- కేవలం పట్టాదారు పాస్ పుస్తకంతో సరిచూస్తాం
- బంగారం తాకట్టు రుణాలకు మాఫీ వర్తించదు
- రుణమాఫీ తరవాత రైతుబంధుపై దృష్టి పెడతాం
- అప్పులు తగ్గించుకునే పనిలో ఉన్నాం
- వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన
- ధరణి, మండలాలు, జిల్లాలపై అసెంబ్లీలో చర్చ
- ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది..ఆదాయం పెరిగింది
- కెసిఆర్ చేసిన తప్పులు తాము చేయబోం
- చేరికలు అంతటా జరుగుతూనే ఉన్నాయి
- కులగణన చేపట్టి తీరుతాం
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

తరంగాలు-న్యూఢిల్లీ,

తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి రేవంత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు-15 లోగా ఈ హామీని నెరవేరుస్తానని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాటిచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రక్రియ కూడా దాదాపు మొదలైంది. ఢిల్లీ పర్యటనలో బిజిబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ప్రస్తావన వచ్చింది. దీనిపై మాట్లాడిన సీఎం.. రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని.. అది కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రూ. 2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని.. మరోసారి స్పష్టం చేశారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు మాఫీ కావని కూడా సీఎం చెప్పేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ క్రమంలో రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని సీఎం

-మిగతా 2 లో

# దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు

- మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందాం
- తెలంగాణ ఆర్తి మనకే బాగా తెలుసు
- తెలంగాణ ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేది మనమే
- పార్టీని నేతలెవరూ ప్రభావితం చేయలేరు
- నిజామాబాద్, కరీంనగర్ నేతలతో కెసిఆర్






తరంగాలు-గజ్వేల్,

పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? అని వ్యాఖ్యానించారు. ఎక్కడైతే పార్టీని వీడారో అక్కడ మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను బయలుదేరినప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేలు లేరని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి నిజామాబాద్,కరీంనగర్ జిల్లా

-మిగతా 2 లో



## కెసిఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

-తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం

హైదరాబాద్,

హైకోర్టులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ

-మిగతా 2 లో



## వాయిదాలతో మొదలైన పార్లమెంట్

- నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షం పట్టు
- చర్చ కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చిన కాంగ్రెస్
- తిరస్కరించిన స్పీకర్ ఓంబిర్లా..గందరగోళం మధ్య జూలై1కి వాయిదా

తరంగాలు-న్యూఢిల్లీ,

లోక్‌సభ సమావేశాలు వాయిదాలతో మొదలయ్యాయి. నీట్‌పేపర్ లీక్‌పై చర్చించాలన్న విపక్షాల డిమాండ్ కారణంగా గందరగోళం మధ్య లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. సాధారణ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షనేత రాహుల్ గాంధీ వాయిదా తీర్మానం ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌పై చర్చించాల్సి ఉందని,

-మిగతా 2 లో



## ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం

- త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం
- కేంద్ర బృందం వచ్చేలోగా నివేదికలు సిద్ధం
- అధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

హైదరాబాద్,

మనం నిర్మించే ప్రతి రోడ్డు ప్రజలకు ఉపయోగపడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. జూలై మొదటి వారంలో ఎన్‌హెచ్

-మిగతా 2 లో



## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్,


తెలంగాణ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదలయ్యాయి. సప్లిమెంటరీ ఫలితాల్లో 73.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలకు 51,272 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 46,731 మంది హాజరయ్యారు. వీరిలో 34,126 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 71.01 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, బాలికలు 76.37 శాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటారు. బాలుర కంటే బాలికలు 5.36 శాతం అధికంగా ఉత్తీర్ణత

-మిగతా 2 లో

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు

- పలు ప్రాంతాలన్నీ జలమయం
- విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ కప్పు
- కారులోనే ఉన్న వ్యక్తి అక్కడిక్కడే మృతి
- పలు కార్లు ధ్వంసం...సమాయక చర్యలు ముమ్మరం
- గటనా స్థలిని పరిశీలించిన మంత్రి రామ్మోహన్ నాయుడు

2 లో



తరంగాలు
Tharangalu Daily News Paper
RNI . TELTEL / 2022 / 83463

# రేషన్ కార్డు ఆధారంగా మాఫీ ఉండదు

(మొదటి తరువాయి)

రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ తర్వాత రైతుబంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలుంటాయన్నారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పాం. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలతో బడ్జెట్ ఉండకూడని అధికారులను ఆదేశాలు ఇచ్చాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తాం. కాళేశ్వరం సంబంధించిన వాస్తవాలను కూడా అసెంబ్లీ ముందుకు తెస్తాం. చర్చల తర్వాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళ్తాం అని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. ఆర్టీసీకి ప్రతి నెలా రూ.350 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 30శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. తద్వారా ఆర్టీసీకి నిర్వహణ నష్టాలు తగ్గాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లాభాలతో ఆర్టీసీ నడుస్తోంది. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్నా సరే.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తాం అన్నారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ప్రతి నెల రూ. 7వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ. 6,500 కోట్లు కట్టేవారు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారు. రుణభారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో ఉన్నాం. ఒక్కశాతం తగ్గినా రూ. 700 కోట్లు ఆదా అవుతాయి. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. బడ్జెట్ కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రులు.. కేంద్రమంత్రులను ఇప్పటికే ఒకసారి కలిశారు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి'లో ఉన్న లోపాలు సరి చేసే పనిలో ఉన్నాము. ఆ తరవాత ఏ పేరు పెట్టినా నడుస్తుంది. కంప్యూటరైజ్ చేయాలా..? లేక మాన్యువల్ పద్ధతి పాటించాలా..? రెండే పద్ధతులు. ఏది చేయాలో అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. ఏ పాలసీ అయినా... ముందు అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాతే మార్పు చేర్పులతో తుది విధానం ప్రకటన చేస్తామని అన్నారు.. ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయం. కేసీఆర్ చేసిన తప్పులను మేం చెయ్యం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో విద్యుత్ కోత లేదు పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చే సరికి ప్రతి సంవత్సరం జరిగే నిర్వహణ పనులు జరగడం వల్ల అంతరాయం ఏర్పడింది. బడ్జెట్ వ్యవహారంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలకు ఉచిత రవాణా సదుపాయం వల్ల టెంపుల్ టూరిజం పెరిగింది. అక్కడ జీఎస్టీ కూడా పెరిగింది' అని రేవంత్ చెప్పుకొచ్చారు. 'రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతు రుణమాఫీ తరువాత రైతు బంధు ఇతర పథకాల పై దృష్టి పెడతాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయం లో కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు

(మొదటి తరువాయి)

నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉందని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ధైర్య వచనాలు చెప్పారు. కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. కొన్ని కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారని, మొన్నటి ఎన్నికల్లో అదే జరిగిందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడొద్దతీ, అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతికాదని పార్టీ కేడర్‌కు హితబోధ చేశారు. ఏ హోదాలోవున్న కానీ ప్రజల కోసం పని చేయాల్సిందేనని, అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి మాత్రమేనని అన్నారు. ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను బీఆర్ఎస్ మాత్రమే నెరవేరుస్తుందన్నారు. ఆనాడు ఉద్యమంలకు దిగినప్పుడు మనతో ఎవరున్నారు?. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటదని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కే. సంజయ్ కుమార్ ఒక పక్క డాక్టర్‌గా మరోపక్క ఎమ్మెల్యేగా ప్రజాసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కేసీఆర్ అభినందించారు. గత 15 రోజులుగా కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం కూడా కొనసాగాయి. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు మూడు రోజులు బ్రేక్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. కేసీఆర్‌తో పార్టీ ముఖ్యనేతలు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆత్మీయ సమావేశాల పునఃప్రారంభ వివరాలను, ఏ నియోజకవర్గాల వారు ఎప్పుడు రావాలనే విషయాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఇప్పటికే పలు దఫాలుగా పార్టీ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమవుతున్నారు.

# కెసిఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

(మొదటి తరువాయి)

అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరించవద్దని అడ్వకేట్ జనరల్ కోరారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడం పైనే వాదనలు వినిపించాలని? మెరిట్స్‌లోకి వెళ్లవద్దని ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతర వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిపై నివేదిక ఇవ్వాలే గానీ, మీడియాకు వివరాలు వెల్లడించకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చుమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు గురువారం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజస్ట్రీకిఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్-తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు. అయితే, జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేం దుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది అదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడించిన మేరకు విచారణ జరిగింది.

# ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం

(మొదటి తరువాయి)

ఉన్నతాధికారుల బృందం రానున్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరై పనులు నడుస్తున్నవి, పలు అనుమతుల కోసం పనులు ఆగిపోయినవి, అప్‌గ్రేడ్ కోసం విన్నవించిన జాతీయ రహదారులకు సంబంధించిన సమస్త సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా రోజూ పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోతుంటే నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. ఎన్ని కోట్లు పెట్టిన పోయిన ప్రాణం తిరిగి రాదని.. ప్రభుత్వం నిర్మించాల్సిన రోడ్డు మూలంగా ప్రజల ప్రాణాలు పోతే.. ఇక ప్రభుత్వం ఉండి ఎందుకని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని న్యాక్ ఆఫీసులో జాతీయ రహదారులపై ఎన్‌హెచ్, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రానికి మణిహారంగా మారనున్న రీజినల్ రింగ్ రోడ్డు ( ఆర్‌ఆర్‌ఆర్ )పై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. ముఖ్యంగా ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో మరింత చురుగ్గా పనులు చేయాలని మంత్రి సూచించారు. ఒక్క ఆర్‌ఆర్‌ఆర్ పనులు ప్రారంభమైతే రాష్ట్రానికి ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, డిస్నీల్యాండ్ వంటి ప్రఖ్యాత సంస్థలు, ట్రాన్స్‌పోర్టు హబ్‌లు, పారిశ్రామిక కారిడార్లు ఏర్పడి రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు.

# -టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

(మొదటి తరువాయి)

నమోదు చేశారు. నిర్మల్ జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా 42.14 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి చివరి స్థానంలో నిలిచింది. ఫలితాల కోసం ఈ వెబ్‌సైట్‌ను క్లిక్ చేయొచ్చు. రీకౌంటింగ్ చేయించాలనుకునే విద్యార్థులు ఒక్కో స్జబెక్ట్‌కు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం జులై 8వ తేదీ లోపు ఎస్బీఐ బ్యాంక్ ద్వారా చలాన్ చెల్లించాలి. ఆ చలాన్‌తో పాటు దరఖాస్తును ఎస్సెస్సీ బోర్డులో సమర్పించాలి. డిమాండ్ డ్రాఫ్టులు అంగీకరించబడవు అని అధికారులు స్పష్టం చేశారు.


# వాయిదాలతో మొదలైన పార్లమెంట్

(మొదటి తరువాయి)

వారికి పార్లమెంట్ భరోసా ఇవ్వాల్సి ఉందని అన్నారు. అయితే నిబంధనల మేరకు రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ ప్రారంభించాల్సి ఉన్నందున, అందులో ప్రస్తావించాలని స్పీకర్ ఓంబిర్లా సూచించారు. లేదా మరో తరహాలో చర్చకు అనుమతిస్తామని చెప్పారు. అయితే విపక్ష సభ్యులు అందుకు నిరాకరించారు. నీట్‌పై చర్చ చేయాల్సిందే నని పట్టుబట్టారు. నినాదలతో గందరగోళ పరిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 'నీట్ పేపర్ లీక్ వ్యవహారం దుమారం రేపుతోంది. దీనిపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో శుక్రవారం గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై స్పీకర్ చర్చను ప్రారంభించగా.. ప్రతిపక్షాలు నీట్ అంశాన్ని లేవనెత్తాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల కోసం సభలో చర్చించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. ఇందుకు సభాపతి ఓం బిర్లా అంగీకరించకపోవడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే విపక్షాలు నిబంధనలు కాదని డిమాండ్ చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని ధన్యావా తీర్మానం అయిపోయాక చర్చకు అవకాశం ఉంటుందని చెప్పారు. అయితే దీనిని విపక్షాలు అంగీకరించలేదు. ప్రతిపక్షాల నిరసన నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం కన్పించింది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వారి ఆందోళనల నడుమ కొంతసేపు ఛైర్మన్ సభను నడిపించారు. అయినప్పటికీ వారు తగ్గకపోవడంతో ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. వారి నిరసనల నడుమే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో చర్చను చేపట్టారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ సమస్య.. దేశ యువతకు సంబంధించిన కీలకమైన అంశం. దానిపై సభలో అర్థవంతమైన, గౌరవప్రదమైన చర్చను ప్రధాని మోదీ చేపట్టాలి. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి పనిచేస్తోందనే సందేశాన్ని పార్లమెంట్ ఇవ్వాలని అన్నారు. 18వ లోక్‌సభ సమావేశాలు సోమవారం

# ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు

-పలు ప్రాంతాలన్నీ జలమయం
-విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ కప్పు
-కారులోనే ఉన్న వ్యక్తి అక్కడిక్కడే మృతి
-పలు కార్లు ధ్వంసం...సమాయక చర్యలు ముమ్మరం
-గటనా స్థలిని పరిశీలించిన మంత్రి రామ్మోహన్ నాయుడు



**తరంగాలు-న్యూఢిల్లీ,**
ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇందిరాగాంధీ విమానాశ్రయం లోని టెర్మినల్ 1లో కొంత పైకప్పు భాగం కూప్పకూలింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. వెంటనే సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో పైకప్పు కింది పార్క్ చేసిన అనేక వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో కారులోని వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పలు విమనాలు రద్దు చేశారు.. కాగా..ఈ ఘటనపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఢిల్లీ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా తాను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని అని ట్వీట్ చేశారు. టెర్మినల్-1 దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 2 వరకు టెర్మినల్-1 నుంచి డిపార్చర్‌కు బ్రేక్ ఇచ్చారు. పునరుద్ధరణ పనుల అనంతరం సర్వీసులను కొనసాగించనున్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. టెర్మినల్ రూఫ్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు.. దీంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే.. కూలిన టెర్మినల్ 16 ఏళ్ల క్రితం నాటిదని పేర్కొంటున్నారు. ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ సహా ఎన్‌సీఆర్‌లో ఏకధాటిగా వర్షం పడుతోంది.

# 100పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన





**-నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉంచాలనేదే లక్ష్యం**
**-ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**తరంగాలు ప్రతినిధి/స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మించనున్న 100పడకల ప్రభుత్వ అస్పత్రి నిర్మాణానికి ఆర్టీసీ కి సంబదించిన స్థలాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్యా,వైద్యం అందుబాటులో ఉంచాలానే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రజలందరికి అందుబాటులో ఆర్టీసీ కి చెందిన 4ఎకరాల స్థలం ఉందని, ఆ స్థలం ఏరియా అస్పత్రి నిర్మాణానికి అనువైన స్థలమని పేర్కొన్నారు. 2001లో ఆర్టీసీ డిపో ఏర్పాటు కోసం ప్రయివేట్ స్థలాన్ని కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థ అప్పగించడం జరిగిందని కానీ 23సంవత్సరాలు గడిచిన ఆ స్థలాన్ని ఆర్టీసీ వినియోగించుకోలేకపోయిందని తెలిపారు. నిరూపయోగంగా ఉన్న ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖ బదలాయిస్తే 100పడకల ఏరియా అస్పత్రి నిర్మాణానికి సరిగ్గా సరిపోతుందని తెలిపారు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వీలైనంత తొందరలో రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థలాన్ని బదలాయించి అస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు సరిపడా సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు.అదే విధంగా మండలానికి ఒకటి చొప్పున అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో విద్యా ప్రమాణలను మెరుగు పరిచి ఉన్నతమైన, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందే విధంగా అలాగే పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన అడిషనల్ డిఆర్డీఓ గుర్రం సురేష్





**తరంగాలు ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో శుక్రవారం రోజు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(అడిషనల్ డిఆర్డీఓ) అదనపు కార్యనిర్వహణాధికారి గుర్రం సురేష్ మండలంలో కోనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. రాఘావాపురం, కూరెళ్ళ, పల్లెర్ల గ్రామాల్లో పర్యటించారు. త్వరలో వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు.మండల కేంద్రంతో పాటుగా ఆయాగ్రామాలలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటేందుకు ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీసే పనులు చేపట్టి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.వనమహోత్సవం కార్యక్రమం మొదలైయే వరకు గుంతలు పూర్తి చేయాలని అన్నారు.అనంతరం ఆయాగ్రామాల్లో ఉపాధి హామీలో నిర్వహిస్తున్న ఫిష్ పాండ్, పారం ఫండ్ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ యాప్ అయిన జనమనరేగాను ఏలా చూడాలో వివరించినారు. వీరివెంటా ఉపాధి హామీ ఎపీఓ బోడిగే రమేష్, టీఏలు ఏగు మల్లేష్, జమాండ్ల యాదిరెడ్డి, ఆయాగ్రామాల ఎఫ్ఏలు ఇస్తారి, యాదమ్మ, సురేష్, కూలీలు ఉన్నారు.

## మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన జడ్పీ చైర్మన్



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి . ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ బాల నర్సయ్య , ఎంపిడిఓ, తహసీల్దార్, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బీర్ల ఐలయ్యకీ మంత్రి పదవి రావాలని కాంగ్రెసు నాయకుల పాదయాత్ర






**తరంగాలు , ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామం శుక్రవారం రోజు సైదాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గంధమల్ల కిష్టయ్య, మాజీ ఉప సర్పంచ్ దుంబాల సురేఖ వెంకట్ రెడ్డి, శిఖ ఉపేందర్, మాజీ వార్డ్ మెంబర్ అచ్చిన సిద్దేశ్వర్ ల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి మంత్రి పదవి ఇవ్వాలని సైదాపురం నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాదాల వరకు పాదయాత్రగా బయలు దేరిన కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మరియు పెద్దకరుమ నంద వెంకటేష్, జిల్లా జానకి రాములు గ్రామ నాయకులు పాల్గొని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాదాల వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కలు చెల్లించుకున్నారు.

# అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి


**-ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు**



**తరంగాలు న్యూస్/ మహబూబాబాద్** గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు.. ఈ సందర్భంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిడి ఎర్రయ్య గారికి వినతిపత్రం అందజేసినారు.. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ...రాష్ట్రంలోనే అత్యధిక గిరిజనులు ఉన్న మహ-బాద్ జిల్లాలో డిప్యూటేషన్ల మీద ఆ శాఖ కొనసాగడం ఏంటని ప్రశ్నించారు..ఒక ఉద్యోగి ఒక చోట నుండి వేతనం తీసుకుంటు అదే శాఖలో వేరోక చోట ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు...దీని వలన ఉద్యోగి లేని చోట స్కూల్ టీచర్లతో నడిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది అన్నారు..ఈ డిప్యూటేషన్లను మీదనే గత కొన్ని సంవత్సరాల నుండి మహ-బాద్ గిరిజన శాఖ నడుస్తుంది అన్నారు.ఈ డిప్యూటేషన్లను మీద సరైన వివరణ ఇచ్చే అధికారులే కరువయ్యారని అన్నారు..ఈ డిప్యూటేషన్లు పిఓ కి,కలెక్టర్ కి తెలిసి జరగడం లేదు అని ఆరోపించారు..కావున తక్షణమే డిప్యూటేషన్ల మీద కొనసాగుతున్న ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్య ప్రకాశ్,గందసిరి జ్యోతి బసు ,వీరెందర్,రవీందర్ పాల్గొన్నారు

# బీర్ల ఐలయ్యకీ మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెసు శ్రేణుల పాదయాత్ర

**-యాదగిరిగుట్ట నుండి కొమురవెల్లి వరకు**




**తరంగాలు ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదాల చెంత నుండి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి మంత్రి పదవి ఇవ్వాలని శుక్రవారం రోజు ఉదయం 8 గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదాల చెంత కొబ్బరికాయలు కొట్టి శ్రీ కొమురవెల్లి మల్లన్న స్వామి వద్దకు పాదయాత్రగా బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కొకుంట్ల బాల్ రెడ్డి,కూరగాయల కృష్ణ, పచ్చిమట్ల మనోజ్, గుండు నరసింహ, బండి అశోక్, ములుగు నరసింహ, పసుల శ్రీనివాస్,సుడుగు వెంకటరెడ్డి, ఆవుల జాంగిర్, వెంకటేష్,పాదయాత్రగా వెళ్ళడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించిన యాదగిరిగుట్ట టౌన్ ప్రెసిడెంట్ బందారపు బిక్షపతి గౌడ్ యాదగిరిగుట్ట మాజీ ధర్మకర్త పెల్లిమెల్లి శ్రీధర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుకల హేమేంద్ర గౌడ్ మాజీ ఉపసర్పంచ్ గుండుపల్లి భరత్ గౌడ్, ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు సుడుగు శ్రీనివాస్ రెడ్డి, భరిగే రామచందర్ , గుండ్లపల్లి లింగం గౌడ్, పల్లపు బాలయ్య,జమాల్ తదితరులు పాల్గొని ఈ పాదయాత్ర యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.

# పాదయాత్ర చేస్తున్న వారికి కాల్వపల్లి గ్రామంలో ఘన స్వాగతం

**-రాజపేట మండల యూత్ కాంగ్రెసు అధ్యక్షుడు ఇంజ నరేష్ ఆధ్వర్యంలో15**



**తరంగాలు ఆలేరు ఆర్సీ :** బడుగు బలహీన వర్గాల నాయకుడు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకీ మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ యాదగిరిగుట్ట నుండి కొమురవెల్లి వరకు పాదయాత్ర చేస్తున్న యాదగిరిగుట్ట టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాజపేట మండలం కాల్వపల్లి గ్రామంలో పాదయాత్ర చేస్తున్న వారికి గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వారితో పాటు యూత్ కాంగ్రెస్ రాజపేట మండల అధ్యక్షులు ఇంజ నరేష్, మండల నాయకులు కళ్లెం పాండు ,ఇంజ శ్రీరాములు, చేర్యాల నాగయ్య, యూత్ కాంగ్రెస్ కాలపల్లి అధ్యక్షులు ఇంజ రాజు, ఎన్ఎస్యూఐ కాలపల్లి అధ్యక్షులు చేర్యాల విష్ణు, చక్రాల బాబు, పెంట పుండరీకం, పెంట సత్యనారాయణ, మడిపల్లి పోషయ్య,ఇంజ దాస్,చేర్యాల అనిల్ కుమార్,ఇంజ నరేష్,ఇంజ శ్రీకాంత్, కార్తీక్, బబ్లు, సంజయ్, తదితర నాయకులు గ్రామస్తులు పాల్గొని పాదయాత్ర చేస్తున్న వారికి స్వాగతం పలికారు.

తరంగాలు
Tharangalu Daily News Paper
RNI. TELTEL / 2022 / 83463

## పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా నివాళులర్పించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తరంగాలు ఆలేరు ఆర్సీ :**
హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ లో పూర్వ ప్రధాని స్వర్గీయ పివి నరసింహరావు జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పీవీ నరసింహారావు సంస్కరణలు అమలు చేయకపోయుంటే దేశం ఇవాళ ఈ స్థితిలో ఉండేది కాదన్నారు. భారతదేశ చరిత్ర ఉన్నంతకాలం పివి చరిత్ర నిలిచి ఉంటుందన్నారు. పీవీ నరసింహారావు గొప్ప సంస్కరణల శీలి అన్నారు.ఆయన మేధావి కాబట్టే అద్భుతమైన పాలన అందించారన్నారు.స్థిత ప్రజ్ఞుడు బహుభాషా కోవిదుడు నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పూర్వ ప్రధాని పివి నరసింహారావు ఆశయాలు సాధించాలన్నారు

## మోటకొండూర్ మస్జీద్ కమిటీ అధ్యక్షులుగా బురాన్, ప్రధాన కార్యదర్శిగా శానూర్



**తరంగాలు , ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని మజీద్ ఏ రెహమానియ కమిటీ నూతన అధ్యక్షులుగా మొహమ్మద్ బురాన్ ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ షానూర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం రోజున జరిగిన మస్జిద్ కమిటీ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా మహమ్మద్ బురాన్ ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అఫ్జల్ ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ షానూర్ సహాయ కార్యదర్శిగా షేక్ అన్వర్ కోశాధికారిగా మహమ్మద్ చాంద్ కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ జాహంగీర్ హాజీ మస్తాన్ సుభాని అంకుష్ జహంగీర్ సలీం ఖలీల్ మునీర్ అష్రఫ్ మౌలానా లతీఫ్, షానూర్ అజీమ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునికి ప్రధాన కార్యదర్శికి మైనార్టీ సోదరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ గా మారగోని శ్రీనివాస గౌడ్ నియామకం



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**
హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ గా వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన మారగోని శ్రీనివాస్ గౌడ్ ను నియమిస్తూ హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు,గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డికి,నియామకానికి సహకరించిన సౌత్ ఇండియా చైర్మన్ రావులపల్లితిరుపతయ్య,తెలంగాణ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఇటికాల మాధవి,ఎండి.సమిమ్ లకుప్రత్యేక,కృతజ్ఞతలు తెలియజేశారు. మానవ హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలాపోరాడుతానని తెలిపారు.

## అనుమతులు లేకుండా కొరటికల్ వాగు నుండి ఇసుక తరలింపు

**–చోద్యం చూస్తున్న అధికారులు అంటున్న ప్రజలు**



**తరంగాలు , ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని కోరటికల్ బిక్కెరు వాగు నుండి ఎటువంటి అనుమతులు లేకుండ ఇసుక ట్రాక్టర్ లతో తరలిస్తున్నారు. ఇసుక తరలింపును నిరోదించవలసిన అధికారులే పట్టించుకోకుండా వదిలేస్తున్నారు అంటు కొరటికల్ గ్రామ ప్రజలు.

# గొర్ల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలి

**–జీఎంపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాడబోయిన లింగయ్య**



**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:**
గొల్ల కురుమలకు డిడిల వాపస్ పక్రియను నిలిపివేసి గొల్ల కురుమల అందరికీ గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ చేస్తారా? చేయరా? చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా గత ప్రభుత్వానికి రెండేండ్ల క్రితం గొర్లు వస్తాయని ఆశతో గొల్ల కురుమలు అప్పులు తెచ్చి లబ్దిదారుల వాటా కింద డి.డి.లు తీసిన గొల్లకురుమలకు వాటాధనం క్రింద కట్టిన డి.డి. ల డబ్బులు తిరిగి వాపస్ ఇవ్వడం నిలిపివేయాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ చేస్తామని లబ్దిదారులను ఎంపిక చేసింది. లబ్దిదారుల వాటాధనం క్రింద ఒక్కొక్కరు 43వేల 750రూపాయల చొప్పున డీ.డీ.లు తీసి, రెండు సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వేల మంది జిల్లాలో 1079 మంది వేచి చూస్తున్నారని తెలిపారు.సకాలంలో గొర్రెలివ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన మూడు నెలలో చేస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీని నెరవేర్చకుండా పాత ప్రభుత్వం అడుగుజాడల్లో నడువాలని చూస్తుంది.అప్పులు చేసి వడ్డీలు కట్టుకుంటూ గొల్ల కురురుమలు ఇబ్బందులనెదుర్కుంటున్నారు. ఇన్ని రోజులు ప్రభుత్వం వద్ద డబ్బులు పెట్టుకొని ఇప్పుడు వాపస్ తీసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేస్తుందా? లేదా? ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించకుండా, పశుసంవర్ధక శాఖకు మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి గాని, ఆ శాఖ ప్రభుత్వ కార్యదర్శిగాని, శాఖ ఉన్నతాధికారులు ఎవ్వరూ మాట్లాడకుండా కొన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా లేఖలు పంపుతూ డీడీల డబ్బులు వాపస్ తీసుకోవాలని ఒత్తిడి చేయడం సిగ్గుచేటు అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఈ పథకంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.గతంలో డీడీలు తీసిన వారందరికీ యూనిట్ మొత్తం (1,75,000)లక్ష డెబ్బై ఐదు వేల రూపాయలను నగదు బదిలీ రూపంలో ఇవ్వాలన్నారు. డి.డి.లు వాపస్ చేసే ప్రక్రియను నిలిపివేయాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మిగిలి ఉన్న లబ్దిదారులందరికీ వెంటనే గొర్రెల పంపిణీ చేయాలని ,పశు సంవర్ధక శాఖకు మంత్రిని కేటాయించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన మూడు నెలల సమయం ముగిసిందని, ఇప్పటి వరకు ఎన్నికల కోడ్ వల్ల గొల్లకురుమలు ఓపికపట్టారని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## బీసీల జనాభా తగ్గట్టు గురుకులాల సీట్లను పెంచాలి

**–బీసీ గురుకులాల సెక్రటరీ సైదులుకి వినతి పత్రం అందజేసిన లింగంగౌడ్**



**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి:**
బీసీల జనాభాకు తగ్గట్టుగా బీసీ గురుకులాల సంఖ్యను పెంచాలని కోరుతూ గురుకులాల కార్యదర్శికి వినతిపత్రం సమర్పించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ గురుకుల పాఠశాలలు విద్యార్థులకు సరిపోవడం లేదని వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే కేవలం వందల మందికి మాత్రమే అవకాశాలు దొరుకుతున్నాయని అన్నారు. గురుకులాల సీట్ల సంఖ్యను రెట్టింపు చేస్తే తప్ప బీసీలకు న్యాయం జరగదని అన్నారు.గురుకులాల కనీస మౌళిక వసతులు కల్పించాలని,స్వంత భవనాలు నిర్మాలించాలని ఐదవ తరగతి నుంచే విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని లింగంగౌడ్ వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ గుంటి మహేష్, నాగేందర్, కొండల్, శ్రీనివాస్ పాల్గొన్నారు

## పదవి విరమణ సన్మానోత్సవం



**తరంగాలు , ఆలేరు ఆర్సీ :**
ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా 38 సంవత్సరాల 7 నెలల పాటు సేవలందించి, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది, ఈ మాసం చివరన ఉద్యోగ విరమణ పొందుతున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మొరిపిరాల ప్రధానోపాధ్యాయులు యాస పద్మారెడ్డిని పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ముత్యం అశోక్ అధ్యక్షతన ఉపాధ్యాయ బృందం మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పూలదండ, శాలువా, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తండా మంగమ్మ శ్రీశైలం గౌడ్ , పాఠశాల శాశ్వతదాత చింతపట్ల వినుకర్ రావు , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ముద్దసాని జయమ్మ , తాజా మాజీ సర్పంచ్ సామ తిరుమలరెడ్డి , గ్రామ పంచాయతీ సెక్రెటరీ అంబోజు శేఖర్ , తాజా మాజీ ప్రధానోపాధ్యాయులు దడిపల్లి వెంకన్న పాల్గొని వారి అంకిత భావాన్ని, వృత్తి నిబద్ధతను కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ముదసాని చిన్న శంకరయ్య గౌడ్ , మాజీ ప్రజా ప్రతినిధులు బద్దం వెంకటరెడ్డి , పంజాల స్వామి , మాజీ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవెళ్ళ శ్రీధర్ , గ్రామ పెద్దలు సామ వెంకటరెడ్డి , యువజన మండలి అధ్యక్షులు ముద్ధసాని శ్రీనివాస్ గౌడ్ మరియు ముప్పిడి స్వామి , ఉపాధ్యాయులు వేనేపల్లి సుజాత , జూకంటి కరుణాకర్ , ఎర్రబెల్లి నాగమల్లు , విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో పీవీ నరసింహారావుది కీలకపాత్ర

**–వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**





**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:**
బహుభాషా కోవిదుడు, జాతీయవాది, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా హనుమకొండ బస్టాండ్ కూడలిలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసంస్కరణలలో భాగంగా పేదలకు తన భూమిని పంచిన గొప్ప సంస్కర్త పీవీ అన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, భావితరాలకు స్ఫూర్తిగా అందించాలని కోరారు.ఈ కార్యక్రమం లో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య, జి డబ్ల్యు సి కమిషనర్ అశ్విని తనాజీ వాకడే, స్టేట్ ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, హనుమకొండ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు,మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ , మాజీ గ్రంధాలయం చైర్మన్ అజిజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని పీవీకి ఎంపీ రవిచంద్ర నివాళి



**తరంగాలు ప్రతినిధి/హైదారాబాద్:**
స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి పీ.వీ.నర్సింహారావు 104వ జయంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర,విప్ దీవకొండ దామోదర్ రావులు ఢిల్లీలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పీవీ దేశానికి చేసిన సేవల్ని గుర్తు చేసుకున్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper

# బిజెపి పాలనలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

**-మతోన్మాదులను హెచ్చరించిన ఎన్నికల ఫలితాలు**
**-విస్తృతి, బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ**
**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ కార్యదర్శి నారాయణ**




తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం:
బిజెపి పాలనలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని అతి కొద్ది మంది చేతుల్లో దేశ సంపద పోగుబడుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఆరోపించారు. భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థ కొందరి గుప్పెట్లో చేరడం ద్వారా ఆర్థికంగా దేశం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు, మోడీ అనుకూల సంస్థలు కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని కూలగోడుతుంటే మరో పక్క పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆరోపించారు. ప్రపంచంలో పేదరికం గణనీయంగా పెరుగుతున్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఒక కుదుపుకు గురవుతుంటే ప్రధాని మోడీ మాత్రం అబద్దాలు చెబుతూ దేశం ఆర్థికంగా వెలిగిపోతుందని ప్రధాని మోడీ చంకలు గుద్దుకుంటున్నారని కాని వాస్తవ పరిస్థితులు ఇందుకు విరుద్దంగా ఉన్నాయని నారాయణ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి గెలిచినప్పటికీ దాని పరిస్థితి చావు తప్పి కన్ను లోట్టబోయినట్లయిందని ఆయన తెలిపారు. బిజెపి 400 సంఖ్య ఎందుకు రాలేదో అర్థం చేసుకోవాలన్నారు.మతోన్మాద శక్తులకు ఈ ఎన్నికలు ఒక గుణపాఠం లాంటివని ఏ మతాన్ని చూపి లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నించిందని తెలిపారు. అయోధ్య రామాలయాన్ని చూపి ఓట్లు దండుకోవాలని చూస్తే చివరకు రామాలయం ఉన్న ఎంపి స్థానం పైజాబాద్ను బిజెపి కోల్పోయిందన్నారు. ఈ ఎన్నికలు మతోన్మాద శక్తులకు ఒక హెచ్చరిక లాంటివని నారాయణ తెలిపారు. బలమైన ప్రతిపక్షం లోక్సభలో ఉండడాన్ని సిపిఐ స్వాగతిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన సమస్యల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని నారాయణ సూచించారు. రైతుబంధు, రుణమాఫీ తో పాటు ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటాల్లో కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో నిలవాలన్నారు.కేంద్రాన్ని నిలువరించేందుకు ఇది సరైన మార్గమని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని బొగ్గు బ్లాకుల వేలం పాటలను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ విస్తరణ బలోపేతం పై దృష్టి సారించనున్నామని నారాయణ తెలిపారు.గ్రామశాఖల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించనున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్ను సంసిద్ధం చేస్తున్నామని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజాపాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ బహుమతులు పంపిణీ చేసిన మాజీ ఎస్సీ సెల్ జిల్లా కో కన్వీనర్ కొండ భాస్కర్



తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి
కంపసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామమైన కోమటిగూడెం మండలం త్రిపురారం జిల్లా నల్గొండ నేతాజీ యువసేన ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది...వారం రోజులపాటు ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించడం జరిగింది ఈ క్రికెట్ పోటీలలో
ప్రథమ బహుమతి 20016/- వెనిగండ్ల గ్రామం గెలుచుకున్నది
ద్వితీయ బహుమతి 15016/-కోమటి గూడెం గెలుచుకున్నది
తృతీయ బహుమతి 10016/- కోమటి గూడెం గెలుచుకున్నది
చతుర్థ బహుమతి 7016/-బాబుసాయిపేట గ్రామం గెలుచుకున్నది
ఈ టికెట్ టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రైజ్ మనీ మరియు షీల్డ్ లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల నాయకులు నంద్యాల రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కో కన్వీనర్ కొండ భాస్కర్, మరియు గ్రామ పెద్దలు జిట్టబోయిన నాగరాజు, అర్వెనబోయిన కోటయ్య, గజ్జి శ్రీకాంత్, బురా మధు, జొన్నలగడ్డ రవి, మధు, అనుముల శివ, శశి, అనుముల మహేష్, చిన్ని. మరియు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించిన ఎంపీపీ నూతి రమేష్



తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోకారం,సంగేం,వర్కట్ పల్లి,గ్రామాల మీదుగా ప్రయాణించే ఆర్టీసీ బస్సును స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మంజూరైన ఆర్టీసీ బస్సును శుక్రవారం ఎంపిపి నూతి రమేష్ రాజ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలిగొండ నుండి పరిసర గ్రామాల మీదుగా చౌటుప్పల్ నుండి దిలుసుక్ నగర్,వరకు ప్రయాణంచేయవచ్చుని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి మండల ప్రజలు కృతజ్ఞతలుతెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాతరాజు ఉమా బాల నరసింహ, మండల,పట్టణ, అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,కంకల కిష్టయ్య,మాజీ సర్పంచ్ పబ్బు ఉపేందర్ బోస్, మండల నాయకులు బత్తిని లింగయ్య, కుందారపుకొమురయ్య పల్లెర్ల రాజు,బత్తిని సత్యనారాయణ, పాలకూర వెంకటేశం బద్దంసంజీవరెడ్డి,చిలుకూరి సత్తిరెడ్డి పోలెపాక జానకి రాములు, కాసుల వెంకన్న, మారగోని నరసింహ, దండ మల్లికార్జున్, రాచమల్లతిరుపతయ్య దేగలఅంజయ్య, మైసొల్లలక్ష్మీనర్సు,దాసోజు నరసింహచారి,దోమకొండసత్యనారాయణ,బులుగులనరసింహ,ఆదిమూలం సోమేశ్,బుగ్గ వినయ్,తదితరులు పాల్గొన్నారు.

### నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే

# ఐపీసీ సెక్షన్ 420 కింద కేసులు

**-మైనర్ డ్రైవింగ్,రాష్ డ్రైవింగ్ పైన మరింత దృష్టి పెట్టాలి**
**-ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :
ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే ఐపీసీ సెక్షన్ 420 కింద కేసులు నమోదు చేస్తామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సందర్శించారు. నగరంలో నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతూ పట్టుబడిన 45 మంది ద్విచక్ర వాహనదారులతో పోలీస్ కమిషనర్ మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్, దొంగతనాలు చేసే నిందుతులు పోలీసుల నుండి సీసీ కెమెరాల నుండి తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనాల నెంబరు ప్లేట్ లను తొలగిస్తున్నారని అన్నారు. అదేవిధంగా చోరి చేసిన వాహనాలతోనే ఎక్కువ నేరాలు చేస్తున్నారని పెర్కొన్నారు. దొంగిలించిన వాహనాలు నకిలీ పత్రాలు సృష్టించి తక్కువ ధరలకు విక్రయిస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఎవరైనా వ్యక్తులు వాహనాలు కొనుగోలు, అమ్మకాలు చేసినట్లతే ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ మార్పు చేసుకోవాలని లేదంటే ఎదైనా నేరాలలో మీ వాహనాలు వున్నట్లు గుర్తిస్తే సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి జరిమానాలు తప్పించుకునేందుకు నెంబర్ ప్లేట్ ను వంచినా, ముగుసు వేసినా, పూర్తిగా లేకుండా చేసిన వారని గుర్తించి వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ట్రాఫిక్ పోలీసులకు ఆదేశించారు.ప్రస్తుతం నంబర్ లేకుండా పట్టుబడిన వాహన పత్రాలు, చాయిస్ నెంబర్లు తనిఖీ చేయాలని, అలాగే చోరికి గురైన వాహనాలు ఏమైనా వున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిలో యువతే ఎక్కువని, ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను అప్రమత్తం చేయాలని కోరారు. ఇకపై నెంబర్ ప్లేట్ తారుమారు చేసినా, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఎక్కడ పడితే అక్కడ సీజ్ చేయాలని ఈ మేరకు స్పెషల్ డ్రైవ్లు నిర్వహించాలని, నంబర్ ప్లేట్లను బిగించిన తర్వాతే వాహనాలను ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ పై మరింత దృష్టి పెట్టాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా ఎంవీ యాక్ట్ కింద కేసులను నమోదు చేస్తామని, ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే జైలు శిక్ష, లేదా జరిమానా ఉంటుందన్నారు.కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సిఐ మోహన్ బాబు, ఎస్సై రవి, సాగర్, పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని పీవీకి ఢిల్లీలో నివాళులర్పించిన ఎంపీ రఘురాం రెడ్డి



తరంగాలు/ఖమ్మం అర్బన్ ప్రతినిధి ఖమ్మం:
మాజీ ప్రధాన మంత్రి పీవీ.నరసింహారావు 103వ జయంతిని పురస్కరించుకొని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ఘన నివాళి అర్పించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..జాతీయ రాజకీయాలలో అపర చాణక్యుడిగా పేరొందారని తెలిపారు. పీవీ తన సరళీకృత ఆర్థిక విధానాలతో ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేశారని చెప్పారు. బహుభాషా కోవిధుడని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. దేశం పక్షాన గొప్ప ఆర్థిక వేత్తగా నిలిచారని, ఆశయ సాధనకు అంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శలు



తరంగాలు /సంగెం
సంగెం మండలం గవిచెర్ల, ఎల్గూర్ స్టేషన్, ఏల్గూర్ రంగంపేట గ్రామాలలో ఇటీవలే వివిధ కారణాలతో మృతి చెందిన గుళ్లపల్లి సాయిలు,గుళ్ళపల్లి కుమార్, బోల్ల కుమార్,బోనాల కృష్ణమూర్తి,ఆశ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. పరమార్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ జనగం శ్రీనివాస్ ,మాజీ సర్పంచ్ దోనికల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి జారిపడి గీత కార్మికునికి గాయాలు



తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన మార్కబాల నరసింహ,ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి జారి పడడంతో తలకు మోకాళ్ళకు మోచేతులకూ తీవ్ర గాయాలు కావడంతో భువనగిరి ఏరియా హాస్పిటల్ కి తరలించారు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు.వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించవలసిందని గౌడ సంఘం నాయకులు కోరుతున్నారు

## పాలడుగులో రోడ్డు ప్రమాదం అక్కడికక్కడే వ్యక్తి మృతి



తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ పై వెళుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.గ్రామంలో రోడ్డుపై ఏర్పాటు చేసిన భారీ కేడ్స్ ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఎం.తుర్కపల్లికి చెందిన మాసంపల్లి పరశురాం మృతి చెందాడు.

## నాగన్న కుటుంబానికి పలువురి చేయూత



తరంగాలు న్యూస్ /నర్సింహులపేట

మహబూబాబాద్ జిల్లా నర్సింహూలపేట మండలం పెద్ద నాగారం గ్రామానికి చెందిన మందుల బక్కమ్మ అనే వృద్ధురాలు, అంధుడైన ఆమె కుమారుడు నాగన్న కడు పేదరికంలో మగ్గడానికి తోడు వారు నివసిస్తున్న గూడు శిథిలావస్థకు చేరుకుని వర్షం కురిస్తే తడిసిముద్దవుతున్నారు. వారి ఈ దయనీయ పరిస్థితిని మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు ప్రతిస్పందించిన రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ బాధ్యులు ఆ కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ పి.వి.ప్రసాద్, సెక్రటరీ మాధవపెద్ది వెంకట్ రెడ్డి, లయన్స్ క్లబ్ సీనియర్ బాధ్యులు పరకాల శ్రీనివాస్ రెడ్డిలు పెద్ద నాగారంలోని గూడు బాగు కోసం ఎదురుచూస్తున్న తల్లీకొడుకులైన బక్కమ్మ, నాగమ్మలను కలిసి వారికి ధైర్యం చెప్పారు. వారి ఇంటిపైకప్పు కోసం పెద్ద టార్పాలిన్ , బ్లాంకెట్, దోమతెరలను అందించారు. లయన్స్ క్లబ్ తరుపున పరకాల శ్రీనివాస్ రెడ్డి రూ. 5 వేల నగదును అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తొర్రూరు మార్కెట్ మాజీ చైర్మెన్ టేకుల యాదగిరి రెడ్డి మాట్లాడుతూ..మానవ సేవే మాధవసేవ అని గుర్తించిన రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ వారు బక్కమ్మ, నాగన్నలకు బాసటగా నిలవడానికి తమ గ్రామానికి రావడం సంతోషకరమన్నారు. కళ్లు లేకపోయినా మంచి గొంతుతో పాటలు పాడుతూ వృద్ధురాలైన తల్లితోపాటు కుటుంబాన్ని పోషించుకుంటున్నా నాగన్నకు గూడు బాగుచేసుకోవడానికి సాయం చేయడం అభినందనీయమన్నారు. ఇంకా వీరికి సాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీ.ఏ.సి.ఎస్ వైస్ చైర్మన్ బొబ్బ సంజీవ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యుడు పరకాల రవీందర్ రెడ్డి, గ్రామస్తులు యుదీశ్వర్ రెడ్డి, మందుల పరుశరాములు, అజ్మీరా సురేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని పివి నరసింహారావు 103 వ జయంతి



తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ)103వ జయంతి వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీపీ నూతి రమేష్ రాజ్ హాజరై పి వి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావు బహు భాషా పద్మశాలి, రచయిత ప్రధాని పదవిని అధిష్టించిన ఒకే ఒక్క తెలుగువాడు పీవీ నరసింహారావు అని భారత ఆర్థిక వ్యవస్థలోవిప్లవాత్మకమైన సంస్కరణలకు బీజం వేసి కుంటున పడిన ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనతను సొంతం చేసుకున్న వ్యక్తి ఆయన అని,కాంగ్రెస్ నేతృత్వంలో సంఖ్యాబలం లేని మైనార్టీ ప్రభుత్వాన్ని పూర్తికాలం పాటు నడిపించిన గొప్ప ప్రజ్ఞ శాలి పివి నరసింహారావు అని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,కంకల కిష్టయ్య,వైస్ ఎంపీపీ బాతారాజు ఉమా బాల నరసింహ,మాజీ సర్పంచ్ పబ్బు ఉపేందర్ బోస్,బద్ధం సంజీవరెడ్డి,బత్తిని లింగయ్య,సత్యనారాయణ,పాలకూర వెంకటేశం,కాసుల వెంకన్న,కుందారపు కొమురయ్య,పల్లెర్ల రాజు,బత్తిని పాండు గౌడ్,మారగొని నరసింహ,పోలేపాక జానకి రాములు,దేగల అంజయ్య,మైసొల్ల యాదగిరి,లక్ష్మీనరసు, దండ మల్లికార్జున్ రాచమల్లతిరుపతయ్యదాసోజునరసింహాచారి, దోమకొండసత్యనారాయణ,బులుగుల నరసింహ,ఆదిమూలం సోమేష్,బుగ్గ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్య అందించాలని అమరవీరుల స్థూపం ముందు టీ ఎస్ ఎఫ్ నిరసన

**- టీ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునీల్**



తరంగాలు /సంగెం

తెలంగాణ రాష్ట్రంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఉచిత విద్య అందించాలని అదాలత్ అమరవీరుల స్తూపం ముందు టి ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునీల్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు కట్టలేక, ఎస్ సి , ఎస్టీ, బీసీ , మైనారిటీ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు, విద్యకు దూరం అవుతున్నారు.తల్లిదండ్రులు కూలి చేసిన సొమ్ము అంత ఫీజులకు కట్టాల్సి వస్తుంది.ఆర్థికంగా వెనుకబడుతున్నారు.భారత రాజ్యాంగం లో విద్య ప్రాథమిక హక్కు చెబితే..కార్పొరేట్ విద్య వ్యవస్థ దానికి భిన్నంగా ఫుల్ కమర్షియల్ గా బిజినెస్ చేస్తున్నారు. ప్రతి పేదోడికి విద్య అందాలంటేతెలంగాణ లో ఉచిత బస్సు పథకం లాగే...తెలంగాణ లో ఉచిత విద్య అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు, మణి తేజ, సాంబరాజు, సంతోష్, బన్నీ, భరత్, వంశీ, శివ,బబ్లు, సంజయ్,హరి తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి కెసిఆర్ టవర్స్ లో విచ్చలవిడిగా సాగుతున్న గంజాయి అమ్మకాలు





**-జీవితాలను నాశనం చేసుకుంటున్న యువత**

తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :

జిల్లాలో రెబల్ స్థాయిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ గంజాయి అమ్మకాల్లో పెద్దవాళ్ల హస్తం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఏది ఏమైనా గంజాయిని రూపుమాపటానికి పోలీసులు ఉక్కు పాదం మోపాలంటున్నారు ప్రజలు. ముఖ్యముగా ఖమ్మం టేకులపల్లి, కెసిఆర్ టవర్స్ లో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. ఎవరైనా అడ్డుకుంటే వారిని చంపే ప్రయత్నం కూడా చేస్తుంది యువత. ఈ గంజాయి అమ్మకాల్లో కొంతమంది తల్లిదండ్రులు కూడా భాగస్వాములు అయి ఉన్నారని వాదనలు వినిపిస్తున్నాయి. టేకులపల్లి ఐటిఐ కాలేజ్ దగ్గర కూడా రెండు రోజుల క్రితం యువత గంజాయి మత్తులో గొడవలు పెట్టుకుని చచ్చేదాకా తెచ్చుకున్నారు. పోలీసు కూడా ఎలక్షన్లో అయిపోయే అంతవరకు నైట్ కానిస్టేబుల్స్ ను సెక్యూరిటీగా ఉంచారు. కానీ ఎలక్షన్లు అయిపోయిన తర్వాత ఆ కానిస్టేబుల్లను తీసివేశారు. దాదాపుగా 52 బ్లాకులు, 1250 కుటుంబాలు, నాలుగు నుండి ఐదు వేల మంది ప్రజలు, ఇది ఒక ఊరే అని చెప్పుకోవచ్చు, కానీ ఇక్కడ ఆరు నెలలుగా సెక్యూరిటీ కనిపించట్లేదు, రాత్రులు పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు కూడా రావట్లేదు, ఇంత జరుగుతున్న పోలీస్ వ్యవస్థ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వుండిపోయిందని చెప్పుకోవడానికి ఏమాత్రం సందేహం లేదనుకోవచ్చు. గత రెండు రోజుల క్రితం 28వ బ్లాక్లో మతిస్థిమితం లేని రాజేశ్వరి అనే 34 సంవత్సరాల యువతిని గంజాయి మత్తులో వెలుగుమట్ల పార్కుకి తీసుకుని వెళ్లి అక్కడ తనను అన్ని రకాలుగా వేధించి చంపివేశారు.అన్నం సేవా ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు రాజేశ్వరి కుళ్ళిపోయిన శరీరాన్ని పోలీసుల సాయంతో వెలికి తీశారు. కానీ ఈ కేసు విషయమై ఎఫ్ ఐ ఆర్ అయిదా కాలేదా ఇంతవరకు ఏమి లేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కెసిఆర్ టవర్ కి సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అలాగే గంజాయి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

## స్వీపర్ల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా -కూనంనేని

**-కూనంనేనికి వినతి పత్రం సమర్పించిన స్వీపర్లు**




తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :

కరోనా సమయంలో విధుల నుంచి తొలగించిన పాఠశాల స్వీపర్ల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. 2015లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రూ. 2,500 కనీస వేతనంతో సర్వీస్ పర్సన్స్ స్వీపర్లను విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నియమించిందని రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మంది స్వీపర్లను గత ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. శుక్రవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిందిగా -విజ్ఞప్తి చేస్తూ సాంబశివరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ స్వీపర్లను తొలగించడం వల్ల పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని విద్యార్థులు అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం ముఖ్యమని ఈ రెండింటి దృష్ట్యా సర్వీస్ పర్సన్స్ను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, తెలంగాణ సర్వీస్ పర్సన్స్ గౌరవ అధ్యక్షురాలు సిహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు మీరాబీ, జిల్లా కార్యదర్శి రషీద్, మలేకా, అనూష, ఉమా మహేశ్వరి, కృష్ణవేణి, కమలమ్మతదితరులు వినతి పత్రం సమర్పించిన వారిలో పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల పాఠశాలలో బుక్స్, యూనిఫామ్స్ అందచేసిన ఎంపీపీ కళావతి



తరంగాలు /సంగెం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశానుసారం సంగెం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలోని 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థునిలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్ బుక్స్, టెక్స్ బుక్స్, యూనిఫామ్స్ లను ఎంపీపీ కందగట్ల కళావతి విద్యార్థునిలకు అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కళావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము ఉచితంగా స్కూల్ పిల్లలకు ఉచితంగా నోట్ బుక్స్, స్కూల్ యూనిఫార్మ్ అందించటం జరిగిందని అన్నారు, మీరు కష్టపడి , ఇష్టాంగా బాగా చదివి సమాజములో ఉన్నత స్థానంలో ఉండాలి అని అన్నారు.గత విద్యా సంవాశ్చారంలో 100 శాతం టెన్త్ క్లాస్ లో విద్యార్థునిలు పాస్ అయినందుకు పాఠశాల ఉపాధ్యాయునిలను అభినందించారు,పాఠశాలలో ప్రభుత్వం అన్ని వసతులు కల్పించినది అని అన్నారు.ఈ ఇయర్ కూడ ఇష్టంతో చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కె. నీలిమ,ఎంపీటీసీ సంగెం మెట్టిపల్లి మల్లయ్య, ఏపీఎం కిషన్, పాఠశాల ఉపాద్యాలునిలు, విద్యార్థులు పోల్గొన్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI. TELTEL / 2022 / 83463

# కొత్త చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి

-జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
-దేశ వ్యాప్తంగా జూలై 1వ తేది నుండి అమలు కానున్న నూతన చట్టాలు
-నూతన చట్టాలపై జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి దశల వారీగా ముగిసిన శిక్షణా తరగతులు
-ప్రతి ఒక్క పోలీసు అధికారి కొత్త చట్టాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి
-మహబూబాబాద్ జిల్లా పోలీసులకు నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్






**తరంగాలు న్యూస్ /మహబూబాబాద్ :** మహబూబాబాడ్ జిల్లా కేంద్రం టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ నందు నూతన చట్టాల గురించి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ ఐపిఎస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జులై ఒకటో తేదీ నుండి అమలులోకి రానున్న నూతన చట్టాల పట్ల ప్రతి ఒక్క పోలీసు అధికారి మరియు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో ప్రతి సబ్ డివిజన్లోని అధికారులు, సిబ్బందికి ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.జులై 1వ తేది నుండి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని,అందుకు అనుగుణంగా కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు.కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత( బి ఎం ఎస్),భారతీయ నాగరిక్ సురక్ష సంహిత( బి ఎన్ ఎస్ ఎస్),భారతీయ సాక్ష్యా అధినియం-2023 పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని,కొత్త చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే సాధ్యం అవుతుందన్నారు. కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు.అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చాన్నారు.అరెస్ట్,వాంగ్మూలం నమోదు నందు పాటించవలసిన జాగ్రత్తలు పాటిస్తూ నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించవలసిన తీరు,తదితర అంశాలపై కొత్త చట్టాలలో మార్పుల గురించి వివరించారు. భారతన్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదనీ,అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాలను రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు.నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు,విధి విధానాలు,విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని,ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు.అధికారులు,సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఈ నూతన చట్టాలపై పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడంలో సమన్వయాధికారిగా వ్యవహరించిన డీసీఆర్బీ డిఎస్పీ గంద్రతి మోహన్ మరియు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, సబ్ డివిజన్లోని పోలీసు అధికారులు తిరుపతి రావు మరియు సీఐ డోర్నకల్ ఉపేందర్, ఎస్. ఐ రమాదేవి, ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.

## దేశ దశాదిశా మార్చిన మహా నాయకుడు పీవీ నరసింహారావు

-హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



తరంగాలు /హన్మకొండ ప్రతినిధి
భారత రత్న,మాజీ ప్రధాని,పీవీ గొప్ప పరిపాలన దక్షుడు అని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.శుక్రవారం మాజీ ప్రధాని భారతరత్న పీవీ నరసింహారావు 103 జయంతి సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పివి ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన వారనీ, అయన జయంతి సందర్భంగా అందరూ ఇక్కడకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.వరంగల్ లో జన్మించి దేశ దశాదిశా మార్చిన మహా నాయకుడు పీవీ నరసింహారావు అని అన్నారు. 1952లో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పీవీ.. ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధాని పదవులను అలంకరించారు. సంస్కరణలకు బీజం వేసి కుంటుపడుతున్న దేశ ఎకానమీని పట్టాలెక్కించారని అన్నారు. ఆ ఫలాలు నేటి తరం అనుభవిస్తున్నామని అన్నారు .ఆనాడు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా కూడా పీవీ అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టారు.పీవీ కి 17 భాషల్లో ప్రావీణ్యం ఉన్నప్పటికీ తన మాతృభాష తెలుగు అభివృద్ధికి పీవీ ఎంతోగానో కృషి చేశారని అన్నారు.అంతకు ముందు పివి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్,ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య,ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,నాగరాజు,ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే,అదనపు కలెక్టర్ రాధిక గుప్తా,వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ,స్థానిక ప్రజా ప్రతినిధులు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి



తరంగాలు /హన్మకొండ ప్రతినిధి
హనుమకొండ కిషన్ పుర లోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమములో గ్రీన్ ఇండియా మిషన్ అనే పేరుతో చెట్లను నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భముగా ప్రిన్సిపాల్ సీమ విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు.అనంతరం మాట్లాడుతూ రేపటి తరాలకు మొక్కల ఆవశ్యకత గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విధ్యార్థులకు మొక్కల ఆవశ్యకతను తెలపడం చాలా ఆనందంగా ఉందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని రక్షించుకునే బాధ్యత కూడా విద్యార్థులే చేపట్టాలన్నారు.అదే విధంగా గ్రీన్ ఇండియా మిషన్ లో ప్లాస్టిక్ బ్యాగులను, ప్లాస్టిక్ సంబంధించిన వస్తువులను వాడకూడదని, క్లాత్ బ్యాగ్స్ వాడడం వల్ల మన భూమిని, నీటిని కాపాడుకున్న వాళ్ళమవుతామన్నారు.పుట్టినరోజు కానుకలుగా,అలాగే ఇతర సందర్భాల్లో కూడా మొక్కలను బహుకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, అకాడమిక్ డైరెక్టర్ శ్రీవిద్య,ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, కోఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు, అకాడమిక్ డీన్ ప్రవీణ్,సి బ్యాచ్ ఇంచార్జ్ చంద్రకాంత్,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతారామ ఎత్తిపోతల పథకం పంపు హౌస్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



తరంగాలు /భద్రాద్రి ప్రతినిధి
అశ్వాపురం మండలంలోని బిజీ కొత్తూరు సమీపంలో గల సీతారామ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ ను శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆయనకు మ్యాప్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ పంపు ద్వారా 1500 క్యూసెక్కుల నీరు వస్తుందని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 4 పంపుల ద్వారా 104 కిలోమీటర్లు నీరు పంపుటకు ప్రధాన కాలువ సిద్ధంగా ఉందని, ఆగస్టు మాసంలో నీరు విడుదల చేయుటకు అన్ని పనులు పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు.ఈ కాలువకు ఏన్కూరు వద్ద నాగార్జునసాగర్ కాలువకు అనుసంధానం చేయబడుతుందని తెలిపారు . తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో1.20 లక్షల ఎకరాలకు మొదటి విడతగా నీటి లభ్యత కల్పించబడును.ఈ విధంగా రాబోయే మూడు సంవత్సరాలలో విడతల వారీగా సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో 6.74 లక్షల ఎకరాలకు నీరు అందించబడునని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి సూపరిండెంట్ ఇంజనీర్లు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మరియు కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## బాధిత కుటుంబానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



తరంగాలు ప్రతినిధి/రాయపర్తి:
రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి శ్రీనివాస్ రావు కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సింహా నాయక్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల నాయకులు ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి,పోలినేని శ్యామ్ రావు,మాజీ సర్పంచ్ కర్ర సరితా రవీందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు దేశబోయిన ఉపేందర్,మాజీ ఉప సర్పంచ్ కొమ్ము రాజు, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల మహేష్, సీనియర్ నాయకులు సత్యనారాయణ రావు, పులి సోమయ్య మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళులు

-నగర మేయర్ పునకొల్లు నీరజ మరియు ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్.



తరంగాలు /ఖమ్మం టౌన్
మాజీ ప్రధాన మంత్రి పీవీ.నరసింహారావు 103వ జయంతిని పురస్కరించుకొని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ కాంగ్రెస్ నేతలతో కలిసి శుక్రవారం లకారం జంక్షన్ లోని పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నగర మేయర్ నీరజ మాట్లాడుతూ... జాతీయ రాజకీయాలలో అపర చాణక్యుడిగా పేరొందారని తెలిపారు. పీవీ తన సరళీకృత ఆర్థిక విధానాలతో ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేశారని చెప్పారు. బహుభాషా కోవిధుడని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. దేశం పక్షాన గొప్ప ఆర్థిక వేత్తగా నిలిచారని, ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, బడేసాహెబ్, కార్పొరేటర్ ఆళ్ల నిరీష రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కమతం రామకృష్ణ, తోట ప్రసాద్, సరిపూడి సతీష్, ఆళ్ల అంజి రెడ్డి, ప్రతిభా రెడ్డి, ప్రశాంతి, కూచిపూడి జై తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

-వాహన తనిఖీల్లో పట్టుకున్న కొత్తగూడెం వన్టౌన్ పోలీసులు




తరంగాలు /భద్రాద్రి ప్రతినిధి :
వాహన తనిఖీల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకున్నట్లు కొత్తగూడెం వన్టౌన్ పోలీసులు తెలిపారు.వన్టౌన్ సిఐ కరుణాకర్ వివరాలను వెల్లదించారు.కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద ఎస్సై విజయ తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా పోలీసు వారిని చూసి ద్విచక్ర వాహనంతో అటుగా వస్తున్న ఒక వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా అతనిని పట్టుకున్నారు.అనంతరం అతనిని విచారించగా అతని పేరు సల్లా చంద్రశేఖర్ తండ్రీ ముసలయ్య,హౌసింగ్ బోర్డు కాలనీ, చుంచుపల్లి,రత్నాల చెరువు,మంగళగిరి,గుంటూరు జిల్లా అని తెలిపాడు.కొత్తగూడెం బస్టాండ్ ఏరియాలో మూడు బైకులను దొంగతనం చేసినట్లుగా అతను అంగీకరించడం జరిగిందని వన్టౌన్ సిఐ కరుణాకర్ వివరాలను వెల్లడించారు.నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించడం జరిగిందని తెలిపారు.ఈ విషయంలో ప్రతిభ కనపరిచిన హెడ్ కానిస్టేబుల్ ఘని,కానిస్టేబుళ్ళు సురేష్,వీరన్న,నరేష్, ప్రసాద్ లను సిఐ అభినందించారు.

## బావిలోపడి గొర్రెల కాపరి మృతి



**తరంగాలు న్యూస్ /నర్సింహుల పేట**
మండల కేంద్రంలోని నర్సింహాపురం బంజారా గ్రామానికి చెందిన గొర్లకాపరి గురువారం సాయంత్రం కాలుజారి బావిలో పడి మరణించాడు. వివరాలోకి వెళితే.. నర్సింహాపురం బంజర గ్రామం లో నిమ్మరబోయిన నరేష్, తండ్రి ఉప్పలయ్య వయసు 26 సంవత్సరాలు తన రోజు వారి కార్యక్రమం లో భాగంగా తన గొర్రెలను మేతకు తీసుకెళ్లి వ్యవసాయ బావి ప్రక్కన మేపుతున్న సందర్భంగా ప్రమాదవశాత్తు కాలు జారీ బావిలో పడి మృతి చెందాడు. మృతుడితండ్రి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై గంద్రాతి సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



# అండమాన్‌లో సూర్య, పూజాహెగ్డేలపై చిత్రీకరణ

కథానాయకుడు సూర్య ప్రస్తుతం తన 44వ చిత్రంతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు. కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టోన్‌బెంచ్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూజా హెగ్డే కథానాయిక. ఈ చిత్ర తొలి షెడ్యూల్ కొన్నాళ్ల క్రితమే అండమాన్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇప్పుడిది ముగింపు దశకు చేరుకుంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ఇప్పటికే సూర్య, పూజలపై రెండు పాటలు చిత్రీకరించినట్లు సమాచారం. అలాగే సూర్యపై ఓ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని.. జులై తొలి వారాంతానికి ఈ షెడ్యూల్ పూర్తవుతుందని తెలుస్తోంది. ఇక రెండవ షెడ్యూల్‌ను జులైలోనే ఊటీలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రేమ, యాక్షన్, వినోదాల మేళవింపుతో ఉన్న ఓ ఆసక్తికర కథతో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకి సంతోష్ నారాయణన్ సంగీతమందిస్తున్నారు.





# సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసిన సత్యభామ

సుమన్ చిక్కాల దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ పోలీసు ఆఫీసర్‌గా నటించిన చిత్రం 'సత్యభామ' క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మెప్పించింది. ఇప్పుడీ సినిమా సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అలరిస్తోంది. నవీన్‌చంద్ర కీలకపాత్రలో కనిపించిన ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, తదితరులు నటించారు. కె.సత్యభామ షీ టీమ్‌లో ఏసీపీ స్థాయిలో పనిచేస్తుంటారు. చూడటానికి శాంతంగా కనిపించినా, నేరస్థుల నుంచి నిజాలు రాబట్టడంలో దిట్ట. తనకు అప్పజెప్పిన కేసుల్ని అంత సులభంగా వదిలిపెట్టదని పేరు. రచయిత అమరేందర్ (నవీన్‌చంద్ర)ని ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఆమె వ్యక్తిగత జీవితానికంటే, వృత్తికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. షీ టీమ్‌లో పనిచేస్తున్నప్పుడే హసీనా అనే ఓ బాధితురాలు గృహహింసని అనుభవిస్తూ సాయం కోసం సత్యభామ దగ్గరికి వస్తుంది. ఆ తర్వాత హసీనా తన భర్త చేతిలో దారుణ హత్యకి గురవుతుంది. హసీనాతోపాటు, ఎంతోమంది జీవితాలతో ఆడుకున్న ఆ నేరస్థుడిని పట్టుకునే క్రమంలో సత్యభామకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ కేసుని ఆమె వ్యక్తిగతంగా తీసుకోవడానికి కారణమేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# ఆ సినిమా రద్దుతో జాన్వీకపూర్ తమిళ ఎంట్రీకి బ్రేక్


కథానాయిక జాన్వీకపూర్‌కు దక్షిణాది అంటే ప్రత్యేకమైన అభిమానం. తన తల్లి శ్రీదేవి తరహాలోనే దక్షిణాదిలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలన్నది జాన్వీకపూర్ లక్ష్యంగా చెబుతారు. అందుకే ఇటీవలకాలంలో హిందీ చిత్రాలకంటే దక్షిణాదిపైనే దృష్టి పెడుతున్నది. తెలుగులో ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి అగ్ర హీరోల చిత్రాల్లో అవకాశాలు సంపాదించుకొని అందరిని ఆశ్చర్యపరిచింది జాన్వీకపూర్. అయితే ఈ అమ్మడి తమిళ ఎంట్రీకి మాత్రం అనూహ్యంగా బ్రేక్ పడింది. వివరాల్లోకి వెళితే.. తమిళంలో సూర్య కథానాయకుడిగా 'కర్ణ' పేరుతో భారీ పాన్ ఇండియా పౌరాణిక చిత్రానికి సన్నాహాలు చేశారు. రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా దర్శకుడు. ఈ చిత్రంలో జాన్వీకపూర్‌ను కీలక పాత్ర కోసం ఎంపిక చేశారు. కొద్ది రోజుల క్రితం ప్రీప్రొడక్షన్ వర్క్ కూడా మొదలుపెట్టారు. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిసింది. అనివార్య కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని చిత్ర బృందం పేర్కొంది. దీంతో జాన్వీకపూర్ తమిళ ఎంట్రీకి తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.



# భారతీయ సినీ పతాకను రెపరెపలాడించిన కల్కి

-నటుడు చిరంజీవి ప్రశంసల వర్షం
-నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిందన్న రాజమౌళి

ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రంపై సినీ సెలబ్రిటీలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నాగ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చి సూపర్‌హిట్ టాక్ తెచ్చుకొంది. తాజాగా మెగాస్టార్, చిరంజీవి , రాజమౌళి ఈ చిత్ర బృందాన్ని సోషల్ మీడియాలో అభినందించారు. ఈ మేరకు చిరు ట్వీట్ చేశారు. 'కల్కి గురించి అన్ని చోట్ల చక్కని స్పందన వినిపిస్తోంది. నాగ్ అశ్వను మైథాలజీ, సైంటిఫిక్ జానర్ కథను ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపికా వంటి భారీ క్యాస్టింగ్‌తో అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నిర్మాతలు అశ్వినీదత్, ప్రియాంక, స్వప్నాలకు అభినందనలు. ప్యాషన్, కరేజ్‌తో టీమంతా సాధించిన సక్సెస్ ఇది. మన సినిమాలు భారతీయ జెండాను మరింత ఎత్తున రెపరెపలాడేలా చేస్తున్నాయని అన్నారు. ÷ాజమౌళి సినిమా గురించి ట్వీట్‌లో రివ్యూ ఇచ్చారు. 'కల్కి' మూవీలో కొత్త ప్రపంచం నిర్మాణాన్ని ఇష్టపడ్డా. అద్భుతమైన సెట్టింగ్‌లతో ఇది నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది. డార్లింగ్ తన టైమింగ్, టాలెంట్‌తో చంపేశాడు. అమితాబ్ జీ, కమల్ సర్, దీపిక నుంచి ఫుల్ సపోర్ట్ దొరికింది. అయితే సినిమా చివరి 30 నిమిషాలు నన్ను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. తమ ఎ÷-లాన్‌ను అమలు చేయడంలో వందశాతం ప్రయత్నం సక్సెస్ సాధించారు. నాగి, అలాగే మొత్తం వైజయంతి టీమ్‌కు అభినందనలు' అంటూ పోస్ట్ చేశారు. -రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. 1000 రెబల్ స్టార్‌లను కలిపితే అది ప్రభాసః అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఐమాక్స్‌లో సినిమాను వీక్షించిన ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సినిమాని ఆదరించిన పవన్ కల్యాణ్ ఫ్యాన్స్, ఇతర హీరోల ఫ్యాన్స్, మా కుటుంబ అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ చిత్రంలో ÷ట్లు మరో స్థాయిలో ఉన్నాయి. వాటి గురించి చెప్పేందుకు మాటల్లేవ్' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.



# కల్కి సినిమాకు రెమ్యునరేషన్ కూడా తీసుకోని మృణాల్

- కారణమిదే



పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా గురువారం (జూన్ 27) ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్ గా నటించింది. అలాగే బిగ్ బీ అమితాబ్ బచ్చన్, లోక నాయకుడు కమల్ హాసన్, దిశా పటానీ, శోభన, రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం తదితరులు ప్రధాన పాత్రల్లో మెరిశారు. వీరితో పాటు విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, రామ్ గోపాల్ వర్మ, మృణాళ్ ఠాకూర్ తదితరులు క్యామియో రోల్స్ పోషించార కల్కి 2898 ఏడీలో గినియా అనే పాత్రలో మృణాల్ ఠాకూర్ కనిపించింది. సినిమా ఆరంభంలోనే మృణాల్ క్యారెక్టర్ ఎంట్రీ ఇస్తుంది. కాగా కల్కిలో గెస్ట్ రోల్ కోసం మృణాల్ ఎలాంటి రెమ్యునరేషన్ తీసుకోలేదని సమాచారం. ఇందుకు ప్రత్యేక కారణముందట. సీతారామంతో తనకు తెలుగులో బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై అభిమానంతోనే మృణాల్ కల్కి సినిమాలో ఫ్రీగా నటించిందట.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**